శాంతి పాఠములు

(తైత్తిరీయోపనిషత్తునకు శాంతిపాఠములైన "శంనో మిత్రశ్శం వరుణః...",
"సహనావవతు..." శాంతిపాఠములకు సస్వరమంత్ర సహిత
టీకా తాత్పర్య వివరణములు)

Acc. No.
28234

వివరణము

డా.జి.ఎల్.ఎన్.శాస్త్రి, M.Sc., M.Phil., Ph.D.
(రిటైర్డ్) రీడర్ & భౌతికశాస్త్ర విభాగాధ్యక్షులు
టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు

29/3/2002

జగద్గురు పీఠము - గుంటూరు శాఖ
(The World Teacher Trust - Guntur Branch)
గుంటూరు - 522 002
ఫోన్ : 233995

శాంతి పాఠములు

ప్రథమ ముద్రణ 1983
ద్వితీయ ముద్రణ 2001
అన్ని హక్కులు వివరణకర్తవి ©

ప్రతులకు

1. ది వరల్డ్ టీచర్ ట్రస్ట్
   H/o. డా.జి.ఎల్.ఎన్.శాస్త్రి
   5-10-4, 2/9, బ్రాడీపేట
   గుంటూరు - 522 002
   ఫోన్ నెం. (0863) 233995

2. ది వరల్డ్ టీచర్ ట్రస్ట్
   45-40-36/1, అక్కయ్య పాలెం
   విశాఖపట్టణము - 530 016
   ఫోన్ నెం (0891) 565291

వెల : రు.10/-

ముద్రణ : విజయసాయి ఆఫ్‌సెట్ ప్రాసెస్ అండ్ ప్రింటింగ్,
గుంటూరు -2, ఫోన్ : 242345

ముందుమాట

మన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రములో ఎక్కువమంది యజుశ్శాఖకు చెందినవారే ! యజుర్వేదమునకు ఉపనిషత్తు "తైత్తిరీయము". ఈ తైత్తిరీయ ఉపనిషత్తులోని ప్రధానవల్లులైన శిక్షావల్లి, బ్రహ్మావల్లి (ఆనందవల్లి), భృగువల్లులకు ప్రారంభములో 'శంనోమిత్రశ్శం వరుణః .... శాంతిః', 'సహనావవతు... శాంతిః' అను రెండు శాంతి పాఠములుండును. ఈ రెండు శాంతిపాఠములు బహుజనాదరణ పొంది సుఖశుభ శాంతులకై ఎన్నో సందర్భములలో పఠింపబడుచుండును. ఈ రెండు శాంతిపాఠముల - సస్వరమూల మంత్రములు, టీక, తాత్పర్యము మరియు ఆధునిక మానవులకు నచ్చి మెచ్చెడి రీతిలో వాటికి సులభమైన తెలుగువచనములో శాస్త్రీయ వివరణ - ఈ చిన్న పుస్తకము నందు ఈయబడినది. (తైత్తిరీయోపనిషత్తులోని మూడు వల్లులకు 'ఆత్మజ్ఞాన - శాస్త్ర జ్ఞాన' సమన్వయాత్మకమైన వివరణ నేను వ్రాసినా 'తైత్తిరీయో పనిషత్తు' గ్రంథము నందు గలదు). రెండవముద్రణ అవసరమైన ఈ చిన్న పుస్తకములోని విషయములను ఉపాసకులు, సాధకులు గ్రహించి వేదమయ జీవితమును గడుపుదురు గాక ! ఈ పుస్తకమునందలి విషయములు నాకు స్ఫురించుటకు నా బుద్ధిని ప్రచోదనము చేసిన అస్మత్ గురువరేణ్యులు, ప్రాతఃస్మరణీయులు అయిన శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారికి భక్తిపూర్వక ప్రణామములు. ఈ పుస్తక ముద్రణకు కొంత ద్రవ్య సహాయమునందించిన శ్రీమతి కె.లక్ష్మీకాంతం - శ్రీ కె.వెంకుబాబు దంపతికి నా హృదయపూర్వక ధన్యవాదములు, పరమ గురువుల శుభాశీస్సులు.

-జి.ఎల్.ఎన్.శాస్త్రి

శ్రీరస్తు

శాంతి పాఠము - 1

శ్రీ గురుభ్యోనమః హరిఃఓమ్ ॥

శం నో మిత్ర శ్శం వరుణః । శం నో భవ త్వర్యమా । శం న
ఇంద్రో బృహస్పతిః । శం నో విష్ణు రురుక్రమః । నమో బ్రహ్మణే ।
నమ స్తే వాయో । త్వ మేవ ప్రత్యక్షం బ్రహ్మాసి । *త్వ మేవ
ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి । సత్యం వది
ష్యామి । త న్మా మవతు । త ద్వక్తార మవతు । అవతు మామ్ ।
అవతు వక్తారమ్ । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః॥

***

టీక : మిత్రః = మిత్రుడు, కొలతలకు, (Lord of Measures) పగటికి, ప్రాణప్రవృత్తికి అనగా ఆకర్షణాత్మక ప్రక్రియకు అధిష్ఠాన దేవత, నః = మాకు (అనగా విద్య నేర్పు గురువు, నేర్చుకొను శిష్యులకు);

---

* వైదిక సంప్రదాయము ననుసరించి 'త్వమేవ'. శాంకర భాష్యము ననుసరించి 'త్వామేవ'.

శం = సుఖమును, శాంతిని (కలిగించు లేదా కలుగజేయు వాడుగా); వరుణః = వరుణుడు, ఆవరణము గలవాడు, (Lord of Boundaries) అపాన ప్రవృత్తికి అనగా వికర్షణాత్మక ప్రక్రియకు, రాత్రికి అధిష్ఠాన దేవత; నః = (మాకు); అర్యమా = అర్యముడు (నాగలి వలె దున్నుచు పోవువాడు) చూపునకు, నేత్రమునకు అధిష్ఠాన దేవత,(Lord of Spur). నః = మాకు; శం = సుఖమును, శాంతిని (కలుగజేయువాడుగా), భవతు = అగుగాక !; ఇంద్రః = ఇంద్రుడు (అంతరిక్ష దేవత), నః = మాకు, శం = సుఖమును, శాంతిని (కలుగజేయువాడుగా అగుగాక); బృహస్పతిః = (అందుకోవలసిన దానిని వాక్కుగా అందజేయువాడు, అనగా వాక్కునకు, బుద్ధికిని అధిష్ఠాన దేవత) బృహస్పతి, ఉరుక్రమః = త్రివిక్రముడు (కాల, దిశాత్మకముగా విస్తరించు పాదప్రక్షేపము గల); విష్ణుః = విష్ణువు (దేశ కాలాత్మక స్వరూపుడు, సర్వవ్యాపకుడు) (Lord of Pervasion), నః = మాకు; శం = సుఖమును, శాంతిని (కలుగజేయు వాడుగా అగుగాక); బ్రహ్మణే = చెప్పువానిగా మరియు వినువానిగా వేషము వేసుకొనిన ఓ బ్రహ్మ !; నమః = నమస్కారము; వాయో = ఓ వాయుదేవతా! (Lord in the form of his expansion or in the form of Pulsation), తే = నీ కొఱకు; నమః = నమస్కారము; త్వం + ఏవ = త్వమేవ = నీవే; ప్రత్యక్షం = ప్రత్యక్షమైన; బ్రహ్మ = బ్రహ్మము (అని); వదిష్యామి = చెప్పుచున్నాను. అనగా ఉచ్చారణగా పలుకుచున్నాను; ఋతం = ఋతస్వరూపునిగా; వదిష్యామి = చెప్పుచున్నాను; సత్యం (Truth) = సత్యస్వరూపునిగా (కూడ నిన్నే); వదిష్యామి = చెప్పుచున్నాడను, తత్ = ఆ బ్రహ్మము; మాం = నన్ను (అనగా

విద్యార్థి అగు నన్ను); అవతు = రక్షించును గాక; తత్ = ఆ బ్రహ్మము; వక్తారం = ఆచార్యుని లేదా గురువుని (కూడ); అవతు = రక్షించుగాక, మాం = నన్ను; అవతు = రక్షించుగాక ; వక్తారం = గురువుని; అవతు = రక్షించుగాక (Protect) ; ఓం శాంతిః శాంతిః శాంతిః = (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపములు) శాంతించుగాక !

తాత్పర్యము : మిత్ర, వరుణ, అర్యమ, ఇంద్ర, బృహస్పతి, విష్ణు దేవత లారా ! మాకు సుఖ శాంతులను కలుగజేయువారుగా అగుదురు గాక ! ఓ బ్రహ్మమా ! నమస్కారము. వాయుదేవతా నీకు నమస్కారము, నీవే ప్రత్యక్ష బ్రహ్మము అయి ఉన్నావు. (నిజముగా ముమ్మాటికి) నీవే ప్రత్యక్ష బ్రహ్మమని చెప్పుచున్నాను, అప్రయత్న సత్యముగా వచ్చు మాట రూపముగా (నిన్నే) చెప్పుచున్నాను, సత్యరూపమైన మాటగా (నిన్నే) చెప్పుచున్నాను. ఆ బ్రహ్మము నన్ను రక్షించు గాక ! ఆచార్యుని రక్షించు గాక ! నన్ను రక్షించు గాక ! ఆచార్యుని రక్షించు గాక ! ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములైన తాపత్రయములు శాంతింపబడుగాక !

వివరణము : శాంతిపాఠమును "శం" అను అక్షరముతో ప్రారంభించుట ఎంతైనను సమంజసము. "శం" అనగా 'శాంతి' అని అర్థము. శర్మ అనగా గూడా 'శాంతి కలవాడు' అనియే అర్థము. శాంతము లేని శర్మ లందఱును ఆ పేరునకు తగరు. 'విద్యార్థి' అనగా (గురువు లేక ఆచార్యుని వద్దకు వచ్చి) విద్యను అర్థించువాడని అర్థము, విద్య అనగా అక్షరములను చదువుట, వ్రాయుట మాత్రమే కాదు,

అక్షరములను వ్రాయగలుగుట, చదువ గలుగుటలను "అక్షరాస్యత" (Literacy) అందురు. చదువుట, వ్రాయుట నేర్చిన వారిలోకూడ బుద్ధివికసించని వారుండవచ్చును. 'బుద్ధి' యనగా యుక్తాయుక్త వివేక జ్ఞానమునకు సంబంధించిన ఒక శక్తి. మానవునిలో బుద్ధి ఉండుటకు అవకాశము ఉండుట చేతనే జంతువులకన్న వేరుగా గుర్తింపబడుచున్నాడు. వివేకరహితముగ పనిచేసిన వానిని 'బద్ధి లేదా గాడిదా" అని అనుటకూడా మనము వినుచుందుము. ఈ బుద్ధి వికసించుటకు పంచజ్ఞానేంద్రియముల ద్వారా తెలియబడు విషయములేకాక ఇంద్రియాతీతమైన విషయములుకూడ తెలియవలెను. అప్పుడుమాత్రమే నిద్రాణమై యున్న బుద్ధికి జ్ఞానోదయము కల్గును. ఈ విధమైన జ్ఞానోదయమును కలుగజేయునదియే విద్య. ఇట్టి జ్ఞానము కల్గుటకు జ్ఞానమునకు సంబంధించిన దేవతల అనుగ్రహమును సంపాదించు ఉద్దేశ్యముతో విద్యార్థి ముందుగా జ్ఞానమునకు, కొలతలకు సంబంధించిన దేవతను ప్రార్థించవలెను. "మితి" అనగా 'మానము' (Measure) లేదా 'కొలత' అని అర్థము. ఈ కొలతలకు అధిష్ఠాన దేవత "మిత్రుడు". (సంస్కృతములోని "మిత్ర" అను పదము నుండి 'Metre' అను ఇంగ్లీషు పదము పుట్టినది. దీనిని కొలతలకు ఉపయోగించుట తెలిసినవిషయమే కదా!) అందుచే "శంనో మిత్రః" అనగానే 'జ్ఞానమునకు కొలతలకు సంబంధించిన దేవత అయిన మిత్రుడు మాకు శాంతిని కలుగు జేయు గాక' అని ప్రార్థించుట జరిగినది.

దేవతలు మనచుట్టునుఉన్న ఆవరణములోనే ఉందురు.

రేడియోస్టేషను ప్రసారముచేసినపాట మనచుట్టునువుండు చోటులోఉండును. మన రేడియోను ట్యూన్‌చేసికొనినచో అది మనకు వినబడును. అట్లే మన చుట్టునుఉన్న ఆవరణములోని దేవతలతో సంబంధమేర్పడుటకు గాను "శంనోవరుణః" అని ఆవరణమునకు సంబంధించినదేవత అయిన వరుణుని ప్రార్థించుట జరిగినది. ఈ మిత్రావరణులకు మరికొంత వివరణ అవసరము.

సూర్యుడు తూర్పుదిక్కున ఉదయించుటతో పగలు ప్రారంభమగును. ఆ తూర్పుదిక్కునఉదయించు సూర్యునిబట్టి మనము నిర్వర్తించుకొనబోవు కార్యక్రమములను ఏర్పరచుకొందుము. ఈ కార్యక్రమములను నిర్ణయించు కాలమును కొలతగా ఇచ్చునుకాబట్టి తూర్పుదిక్కునఉన్నసూర్యుని 'మిత్రుడు' అందురు. మరియు తూర్పున సూర్యోదయముతో పగలు ప్రారంభమగును. కాబట్టి మిత్రుడు పగటికి, కాలమునకు, కొలతలకు అధిష్ఠాన దేవత (Lord of Day, Time and Measures)

అట్లే పడమటి దిక్కున ఉన్న సూర్యుని వరుణుడు అందురు. వరుణుడు రాత్రికి, ఆవరణములకు (Spaces) అధిష్ఠాన లేదా, అభిమాన దేవత (Lord of Night and boundaries). ఇట్లు చెప్పుటకు గల కారణము కుండలినీయోగ రహస్యము తెలిసినచో - విశదమగును.

అంతరిక్షములో కొంత పరిమాణము (Volume) మేరకు విస్తరించి ఉన్న మనశరీరములో వెన్నెముకకు పైన ప్రజ్ఞ (Consciousness) అనియు, వెన్నెముకకు క్రింద ద్రవ్యము (Matter) అనియు యోగవిద్యలో

సంకేతము గలదు. ఈ వెన్నెముకను 'యోగదండము', 'మేరు దండము' 'బ్రహ్మదండము' అను పేర్లతోగూడ పిలుచుదురు. 1) ఈ వెన్నెముక పైభాగమున కెదురుగా భ్రూమధ్య ప్రాంతములో ఆరవచక్రమైన ఆజ్ఞాచక్రముండును. ఇది తూర్పుదిక్కును తెలియజేయును. బాహ్యరంగములో తూర్పుదిక్కునగల సూర్యుడెట్లో- మన అంతరంగములో ఈ ఆజ్ఞాచక్రము వద్దగల ప్రజ్ఞాకేంద్రము అటువంటిది. ఈ ప్రజ్ఞా కేంద్రము వద్దనే జ్ఞాన నేత్రము (wisdom centre) ఉండును. జ్ఞాన నేత్రమున్న ఈ దిశను 'జ్ఞానదిశ' అనియు, ఈ దిశవద్ద ప్రజ్ఞా కేంద్రమును 'మిత్రుడ'నియు అందురు. 2) వెన్నెముక అడుగుభాగమున కెదురుగా మొదటిదైన మూలాధారచక్రముండును. ఇది పడమటి దిక్కును తెలియ జేయును. బాహ్యరంగములో పడమటిదిక్కునగల సూర్యుడెట్లో, మన అంతరంగములో ఈ పృథివీతత్వమునకు సంబంధించిన మూలాధారచక్రము వద్దగల కేంద్రము అటువంటిది. ఇది శరీరములోని మొత్తము బలమునకు (Strength) స్విచ్ వంటిది. పడమటిదిక్కువద్దగల ఈ కేంద్రమునే 'వరుణుడు' అందురు. "భృగుర్వై వారుణిః" అని భృగువల్లి ప్రారంభింపబడును, ద్రవ్యాత్మక శరీర నిర్మాణమునకు కారణభూతమైన శుక్ర (Sperm) ధాతువునకు సంబంధించిన భృగువును, ఈ ద్రవ్యాత్మకశక్తికి సంబంధించిన కేంద్రమైన వరుణుని కొడుకుగా చెప్పబడుట ఇందులకే! ప్రజ్ఞను పగలు గాను, ద్రవ్యమును రాత్రిగాను గూడ సంకేతించుదురు. అందువలన ప్రజ్ఞా కేంద్రము - 'మిత్రుడు', ద్రవ్య కేంద్రము - 'వరుణుడు' వరుసగా పగటికి, రాత్రికి అభిమాన దేవతలుగా చెప్పబడిరి.

నిద్రనుండి మెలకువవచ్చు స్థితిని సూర్యోదయము తెలియజేయును. ఈ మెలకువతోనే మనకు – మనము, మన చిరునామా, మన ఉద్యోగము, మన చదువు, డిగ్రీలు, డ్యూటీలు, భార్య, పిల్లలు మొదలగునవన్నియు "శతపత్రభిత్తి" న్యాయము వలె అత్యల్ప కాలములో వరుసగా గుర్తుకు వచ్చుట జరిగి – మనస్సు, బుద్ధి వికసించుట జరుగును. బుద్ధివికాసము జ్ఞానమునకు దారితీయును. కాబట్టి ఈ జ్ఞానోదయమును సూర్యోదయముతో సమన్వయపరచవలెను. ఈ సూర్యోదయము తూర్పుదిక్కున జరుగును కాబట్టి తూర్పును "జ్ఞానదిశ" అందురు. మనలో నిద్రాణమై మరుగునపడి ఉన్న విషయములు వెలుగులోనికి వచ్చుటకు ఈ తూర్పుదిశ, అక్కడ వున్న సూర్యుడు లేదా మిత్రుడు ఉపకరించినారు కాబట్టి, ఈ దిశను 'జ్ఞాన దిశ' అనియు, మిత్రుని 'జ్ఞానదేవత' అనియు గ్రహించవలెను. తూర్పు – జ్ఞానదిశ అగుటచేతనే ఎవరికైన ఒక విషయము ఎంత చెప్పినను అర్థము కానపుడు మన పెద్దవారు "తూర్పుకు తిరిగి దండము పెట్టుము" అని అందురు. 'ఆ జ్ఞానదిశ, దాని దేవత కరుణించి అర్థము అగునట్లు చేయవలసినదే ఇక మావలన కాదు' అని ఇందలి భావము.

"అర్" అనగా దున్నుట (To Plough) అని అర్థము. అందువలననే "అరక" అనగా దున్నుసాధనము అయిన "నాగలి" అని అర్థము. శాంతిపాఠములోని "అర్యముడు" అనగా 'దున్నుచూ పోవునట్లగుపడువాడు' అని అర్థము. ఎవరు, దేనిని దున్నుచున్నారని ప్రశ్న రావచ్చును. ఈ అర్యముడుకూడ సూర్యునికిగల ఒక పేరు. సూర్యోదయదిశ నుండి క్రమక్రమముగా ఆకాశ క్షేత్రమును తన కిరణములతో దున్నుకొనుచూ

పోవుచూ చివరకు పశ్చిమదిక్కును చేరునట్లు కనపడుచున్నాడు. కాబట్టి ఇట్టి సూర్యుని "అర్యముడు" అందురు. మన బుద్ధి అను నాగలికూడ నేర్చుకొనబోవు అంతరిక్షములో అంతర్లీనమై ఉన్న జ్ఞానము అను క్షేత్రమును దున్నుచూ పోవుచూ మోక్షము అను పంటను పొందుటకు గాను, తత్ సంబంధమైన అర్యముని ప్రార్థించుట జరిగినది. ఈ దేవత - చూపు ద్వారా అందుకొనవలసినవాడు, అనగా చూపునకు, కంటికి అధిష్ఠాన దేవత. (Lord of Spur) ('చక్షో సూర్యో అజాయత' - పురుష సూక్తం).

తరువాత ఇంద్రుని ప్రార్థించుట జరుగును. "ఇదం-ద్రః-ఇంద్రః" అని ఇంద్ర పదమునకు నిర్వచనము. "ఇదిగో నేను ఇక్కడ ఉన్నాను" అని అంతరిక్షములోని ఏ బిందువువద్దనైననూ వ్యక్తమగుటకు అధిష్ఠానదేవత ఇంద్రుడు. దృగ్గోచరమగు జ్ఞానమును పొందుటకు ఉపకరించు ఇంద్రియములకు పైన ఉన్నవాడు. అనగా ఇంద్రియములకు అధిపతి అయిన మనస్సే ఇంద్రుడు, నేర్చుకొనబోవు విద్య మనస్సు ద్వారా గ్రహింపబడుట జరుగును. కాబట్టి, ఇంద్రుని ప్రార్థించుట జరిగినది.

'బృహస్పతి' అనగా అందుకొనవలసిన దానిని వాక్కుగా అందించువాడు. అందుకొనవలసిన జ్ఞానము. ఆ జ్ఞానవిద్య - వాక్కుద్వారా అందును. కాబట్టి "జ్ఞానవిద్యకు, వాక్కునకు కూడా బృహస్పతియే గురువు" మనస్సైన ఇంద్రునికి గురువు బృహస్పతి. మరియు సర్వదేవతలకును కూడా గురువు బృహస్పతియే! దేవతలనగా మనలోనేయుండి మనచే మంచిపనులుచేయించు శక్తులు, "ఇట్లు చేయుటవలన జ్ఞానము, సుఖము అభివృద్ధి అగును" - అని మంచిని ప్రబోధించువాడు బృహస్పతి.

('జీవో - జ్ఞానసుఖే' - అనగా బృహస్పతి, అనగా గురువు - జ్ఞానమును, సుఖమును ఇచ్చువాడు అని జ్యోతిశ్శాస్త్రకారులు కూడ చెప్పుదురు). అందుచే అట్టి బృహస్పతిని ప్రార్థించుట జరిగినది.

జ్ఞాన సముపార్జనకు ఎంతోమంది సహాయ సహకారములు కావలయును, అట్టి సర్వులుగాను వ్యాపించినట్టి విష్ణువును ('సర్వం విష్ణుమయం జగత్', 'విశ్వంబు విష్ణుండు', 'వ్యాపనశీలః విష్ణుః) ప్రార్థించుట జరుగును. మరియు ఈ విష్ణువు ఎట్టివాడనగా ఉరుక్రముడు. ఒక పాదమును స్థూల ప్రదేశాత్మకమైన భూమిపైననూ, రెండవ పాదమును సూక్ష్మ నిర్దేశాత్మకమైన ఆకాశముపైననూ, ఇక మూడవ పాదమును ఈ చెప్పిన రెండును ఉన్నట్లు చూడగల్గుటకు కారణము లేదా కేంద్రస్థానమైన శిరస్సుపైనను ఉంచి తన మూడు పాదములతో మూడింటిని కొలచినవాడు, (చోటును కొలుచుటకు కావలసిన ప్రాథమిక ప్రమాణములు గూడ పొడవు, వెడల్పు, ఎత్తు అను మూడే గదా!) తన మూడుపాదములతో విక్రమించిన వాడగుటచే విష్ణువునకు 'ఉరుక్రముడ'ని పేరు వచ్చింది. అందువలననే స్థూల, సూక్ష్మ, కారణాత్మకముగా (Physcial, Vital or Subtle and Causal) జ్ఞాన మభివృద్ధి యగుటకు ఉరుక్రముడైన విష్ణువుని ప్రార్థించుట జరిగినది.

'బ్రహ్మణే' అనుటలో పరబ్రహ్మస్మరణ జరుగును, ఇటు - జ్ఞానము నుపదేశించువానిగాను, జ్ఞానమునుపొందువానిగాను భౌతిక రూపములలో కూడా గుణాతీత స్థితినుండి గుణమయుడుగా వ్యక్తమగుచున్న ఆ పరబ్రహ్మకు

నమస్కరించుట జరిగినది. 'ప్రార్థించుచున్నానని' 'నమస్కరించుచున్నానని' చెప్పుటకు "శ్వాసను" పెట్టుబడి పెట్టి చెప్పవలెను. అట్టి శ్వాసకు కారణ భూతమైనది వాయువు. దానికి అధిష్ఠానదేవత అయిన వాయుదేవునికి నమస్కరించుట జరిగినది. మరియు ఈ వాయుదేవుని "నీవే ప్రత్యక్ష బ్రహ్మ అయివున్నావు" అని నిర్ధారించి చెప్పుట జరుగును. ప్రతివారు 'నీవు' అనునపుడు 'ప్రత్యక్ష బ్రహ్మ' అని; 'నేను' అనునపుడు 'ఈశ్వరుడు' అని తెలుసుకొనవలెను. ఈశ్వరుడు ఎవరితో చేయబడి, ఎవరి యొక్క భాగమో ఆయన 'పరమేశ్వరుడు' లేదా 'పరబ్రహ్మ', ఈ రెంటికీ భేదము తెలియవలెనన్నచో ఒక ఉదాహరణ చెప్పుకొనవలెను, నల్లబల్ల (Black Board) మీద ఒక వృత్తమును గీసినచో, ఆ వృత్తములో ఇమిడివున్న నల్లబల్లభాగమును ఈశ్వరుడు గాను, ఆ వృత్తములోనిచోటు దేనితోచేయబడి, దేనియొక్క భాగమో అటువంటి వెనకనున్న నల్లబల్లను (Back ground black board) పరమేశ్వరుడు లేదా పరబ్రహ్మ గాను అర్థము చేసుకొనవలెను. అనగా, ఈశ్వరుడు - చిన్న నేను (Soul), పరమేశ్వరుడు లేదా పరబ్రహ్మ - పెద్దనేను (Spirit) అన్నమాట. లేదా, ఈ రెంటినీ నిప్పురవ్వ, నిప్పువంటివిగా అర్థము చేసికొనవచ్చును. ఈ విషయమే భగవద్గీతలో -

"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి" అని చెప్పబడినది. అనగా ప్రతి జీవి హృదయములోను ఉన్నవాడు ఈశ్వరుడు అని అర్థము.

ఈ పరబ్రహ్మ - దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, మానవాది రూపములాగా వ్యక్తమగునని చెప్పునపుడు సంకోచము, సందేహము

కలుగుటకు అవకాశము కలదేమో కాని, వాయువుగా వ్యక్తమైనాడని చెప్పుట ప్రత్యక్ష సత్యము. ఈ వాయువు మన అస్తిత్వమునకే కారణభూతమైనటు వంటిది. 'పరబ్రహ్మ వాయువుగా వ్యక్తమగుట సత్యముగాదు' అని ఎవరైనా అన్నచో అట్లు ఒప్పుకొనక పోవుటను చెప్పుటకు గూడా శ్వాసలోని నిశ్వాస వాయువునే పెట్టుబడి పెట్టి చెప్పవలెను. కాబట్టి, ఆ నిశ్వాసలోని వాయురూప వాక్యములుగా ఆ పరబ్రహ్మ వ్యక్తమౌచున్నాడు గదా ! ఎవరైన ఇంకెట్లు కాదనగలరు ? అనగా 'నేను నిన్నే ప్రత్యక్ష బ్రహ్మగా చెప్పుచున్నాననునపుడు గూడ నిన్నే పెట్టుబడి పెట్టి, నిన్నే ఉచ్చారణగా చేయుచు, నిన్నే పలుకుచున్నాను. అందుచేతనే "ఓ వాయుదేవతా నీవు వ్యక్తపరబ్రహ్మ ప్రత్యక్షరూపము' అని నమస్కరించుట జరిగినది. రెండవసారి మరల చెప్పుట - 'ఈవిధముగా నేను చెప్పిన విషయములో ఏమాత్రమును అనుమానము లేదు. నిన్నే ప్రత్యక్ష బ్రహ్మగా నొక్కి వక్కాణించుచున్నాను" అని నిర్ధారణ.

ఎవరు - మనలోనుండి పలుకుచున్నపుడు, ఆ పలుకుచున్నది మనమే అనుకొని భ్రమపడుచున్నామో - ఆయనమాటను అనగా అప్రయత్న సత్యముగా వచ్చిన ఆ మాటను 'ఋతము' అందురు. ఋషులు శాపములిచ్చునపుడు, ఆశీర్వదించునపుడు వారినోటినుండి అప్రయత్నముగా వెలువడు మాటనుగూడ ఋతముగా అర్థము చేసుకొనవలెను. మన ప్రయత్నము వలన వచ్చిన మాట మనమాట యగును. మన ప్రమేయములేక మనలోనుండి వచ్చినమాట పరమాత్మునిమాట అగును. "అట్టి అప్రయత్న సత్యమును ఋతమందురు. అట్టి ఋతస్వరూపునిగా ఓ బ్రహ్మమా నిన్నే చెప్పుచున్నాను" అని తరువాత చెప్పబడినది.

అప్రయత్నముగావచ్చిన ఋతమునుండి నేనుగ్రహించిపలుకు మాటలోని నత్యస్వరూపునిగాకూడా నిన్నే చెప్పుచున్నాను - అనుటలో తన కర్తృత్వము లేదని వినయపూర్వకముగా చెప్పుట జరుగును. 'ఋతము' - 'సత్యము'లకు భేదము తెలిసికొనవలె నన్నచో మరల ఒక ఉదాహరణ చెప్పుకొనవలెను. 'పంచదార తియ్యగా నుండును', అను ధర్మమును 'ఋతము' అందురు. పంచదారను తినిన తరువాత అది తియ్యగా నుండునని తెలిసికొనిన ధర్మమును 'సత్యము'గాను, పంచదారను తిననతరువాతనుండి మాత్రమేకాక తినకపూర్వమునుండిగూడా అది తియ్యగానేవుండునన్న ధర్మమును 'ఋతము'గాను అర్థము చేసికొనవలెను.

ఇన్ని విధములుగా పరబ్రహ్మమును ప్రార్థించి చివరకు ఓ బ్రహ్మమా ! నన్నును, ఆచార్యుని - మాప్రయత్నము సఫలమగునట్లు సంరక్షింపుము. అనగా 'శిష్యునకు విద్యను కలుగజేయుటలోనూ, ఆచార్యునకు బోధనావక్తృత్వ సామర్థ్యమును కలుగ జేయునట్లుగాను సంరక్షింపుము'. అని గురుశిష్యులిద్దరి తరపున శిష్యుడే అభ్యర్థనము చేయుట జరుగును. ప్రార్థన వలన కలుగు ఫలము కేవలము తనకు మాత్రమే దక్కవలెననెడి స్వార్థము శిష్యునకు ఉండరాదనునది ఇందు సూచితము. ఆపదలోనున్నపుడు 'రక్షించండి' అని ఒక్కసారి కాక 'రక్షించండి, రక్షించండి' అనునట్లే ఇక్కడ కూడా రెండుసార్లు "తన్మామవతు। తద్వక్తారమవతు । అవతుమాం । అవతువక్తారమ్" అని రెండుసార్లు రక్షించమనుట పునరుక్తి దోషమును కాక సహజత్వమునే (Naturality) సూచించును.

చిట్టచివరకు 'ఈ విద్యాసముపార్జన వలన నాలోని తాపములు ఉపశమింపబడి నేను, నా చుట్టుప్రక్కల వాతావరణము సుఖశాంతులతో వర్థిల్లుగాక!' అని చెప్పుటలో ప్రార్థన ముగియును. శాంతిః, శాంతిః, శాంతిః అని ముమ్మారు ఉచ్చరింపబడుట వలన మూడు విధముల తాపములు శమింపబడవలెనన్న అర్థములో ఇట్లనుట జరిగినది. ఈ మూడు విధముల తాపములనే 'తాపత్రయములు' అని సాధారణముగా మనము వాడుచుందుము. అవి -

1. ఆధ్యాత్మిక తాపము 2. అధి భౌతిక తాపము 3. అధిదైవిక తాపము.

మన శరీరమునకు వచ్చు జ్వరము, పంటిపోటు, గుండెనొప్పి మొదలైనవానిని ఆధ్యాత్మిక తాపములుగాను; ఇంటిలో దొంగలు పడుట, పొరుగువారితో పోట్లాటలు, కొట్లాటలు మొదలైనవి అధిభౌతిక తాపములుగాను ఇక అతివృష్టి, అనావృష్టి మొదలైన వానిని అధిదైవిక తాపములుగాను చెప్పుకొన వచ్చును. ఆధ్యాత్మికతాపము శమించినచో వ్యక్తిగతముగా ప్రతిఫలమును, అదిభౌతిక తాపోపశమనముతో సమాజమునకు ప్రతిఫలమును, అధిదైవిక తాపోపశమనముతో జగత్కళ్యాణమే ప్రతిఫలముగాను సిద్ధించును.

ఇట్టి ప్రార్థనలు, శాంతి పాఠములు కుల, వర్గ, వర్ణ, మత, జాతి భేదము లేక సర్వులకును శ్రేయస్సును చేకూర్చును. భారతీయుల

ప్రార్థనలన్నియు ఈ విధముగా స్వార్థరహితముగానుండునని గుర్తించుకొనవలెను, విద్యాభ్యాస ప్రసంగాది సమయములలో, ఆద్యంతముల యందుకూడ ఇట్టి ప్రార్థనలను పఠించి పరబ్రహ్మ అనుగ్రహమును పొందవచ్చును.

శాంతి పాఠము - 2

హరిః ఓమ్ ॥ సహ నా వవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై । తేజస్వి నా వధీత మస్తు మా విద్విషావహై ।

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

* * *

టీక : సహనౌ = (గురుశిష్యులమైన) మా ఇద్దఱిని కూడ, (పరబ్రహ్మ) అవతు = సంరక్షించును గాక, సహనౌ = (గురుశిష్యుల మైన) మా ఇద్దఱిని కూడ, భునక్తు = అనుభవించి పాలించును గాక, సహ వీర్యం = కార్యదక్షత, సామర్థ్యమును గూడ, (కలిగి యుండి), కరవావహై = (పనులను) నిర్వర్తించెదము గాక, నౌ = మా యొక్క అధీతం = అధ్యయనము చేయబడిన విద్య, తేజస్వి = తేజోవంతమైనది, అస్తు = అగుగాక, మా విద్విషావహై = (మా ఇరువురిమధ్య అనగా గురు శిష్యుల మధ్య) ద్వేషము కలుగకుండుగాక, ఓం శాన్తి, శ్శాన్తి, శ్శాన్తిః = ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపత్రయమునకు శాంతి కలుగుగాక !

తాత్పర్యము : (పరబ్రహ్మ) మా గురుశిష్యులిద్దఱిని సంరక్షించును గాక, (పరబ్రహ్మ) మా ఇరువురని అనుభవించి పరిపాలించునుగాక. (మేమిద్దఱము) కార్యదక్షత, సామర్థ్యమునుగూడ కలిగియుండి, పనులను నిర్వర్తించెదముగాక, (మా ఇరువురి మధ్య) అభిప్రాయ భేద, ద్వేషాది భావముల కలుగకుండుగాక. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపత్రయమునకు శాంత్యోపశమనము కలుగుగాక !

వివరణము : ఇది ఒక చక్కని ప్రార్థన. విద్యారంగమున గురుశిష్యులు గాని, ఇద్దరు లేక ఇద్దరుమించి ఏదైన ఒకపనిని చేయుటకు ఉపక్రమించినపుడుగాని ఈ ప్రార్ధన చేయుట చాల సమంజసముగాను, సార్ధకముగాను ఉండును.

"సహ" అను పద ప్రయోగముచే పరమాత్మను ఏది కోరినను స్వార్ధ బుద్ధితో గాక, తన తోటివారికి కూడ తానుకోరినది అందవలెనను సదుద్దేశ్యము, సత్సంకల్పము, సహకారగుణము ద్యోతకమగును. 'సహనావవతు' అనగా 'సహ – నౌ – అవతు' అని పదవిభాగము. మరియు, 'సహనౌ అవతు' అను వాక్యమును 'స', 'హ', నౌ, అవతు, అని విడదీసినచో మరింత వివరణ అవసరమగును. అనగా 'సహ' అను పదమును 'స', 'హ' అను అక్షరములుగా విడివిడిగా చదివినచో "ఈ 'స' 'హ' లు ఎవరు ? 'స' అను అక్షరము పురుషునకు, లేదా అయ్యవారికి, 'హ' అను అక్షరము ప్రకృతికి లేక అమ్మవారికి ప్రతీకలు. అందువలననే పురుష సూక్తము "సహస్రశీర్షా పురుషః ...." అని, "స" అను అక్షరముతో ప్రారంభింపబడును. అట్లే శ్రీ సూక్తము, (అమ్మవారి సూక్తము) "హిరణ్యవర్ణాం హరిణీమ్..." అని 'హ' అక్షర సంబంధమైన 'హి'తో ప్రారంభింపబడును. అనగా సమస్త విశ్వమునకు తల్లిదండ్రుల (Parents) వంటి వారును, ప్రజ్ఞ (Consciousness) పదార్థముల (Matter) వంటివారును, కేంద్రము (Centre), పరిధుల (Circumfernece వంటివారును, బీజ (Seed) – వృక్షముల (Tree) వంటివారును, ఉచ్ఛ్వాస నిశ్వాసముల వంటివారును అయిన – ఆదిదంపతులు మమ్ము రక్షించుగాక అని గూడ అర్థము వచ్చును.

ప్రతి వ్యక్తి యొక్క శ్వాసక్రియలో ఉచ్ఛ్వాసము నందు నిశ్వాసము నందు'హం' అను ధ్వని పూర్వక అక్షరములు వినబడును. రెంటినీ 'సోఽహం' అను మంత్రముగా, మనలో నిరంతరము ప్రమేయము లేకపోయినను జరుగు అజపాగాయత్రీమంత్రముగా చెప్పుదు ఉచ్ఛ్వాసము – లీనమును (Involution), నిశ్వాసము – వ్యక్తమును (Ev lution) తెలియజేయును. ఈ రెంటినీ జగత్తునకు తండ్రి – తల్లిగా, శి – పార్వతులుగా భారతీయులు చెప్పుదురు. ఈ రెండక్షరముల 'సోహ మంత్రమునే వామగతిగా చదివినచో 'హంసో' లేదా 'హంస' అగును. 'హంస' పక్షినే శరీర గృహమునకు యజమానియైన జీవునిగా చెప్పుదుర తల్లిదండ్రులకు ప్రతీకలైన 'హం' 'సో' ల కలయికతో జీవుడు వ్యక్తమగున సూచితము. కాబట్టి 'సహ నౌ అవతు' అనునపుడు 'జగజ్జననీ జనకుల మమ్ము రక్షించుగాక' అని ప్రప్రథముగా ప్రార్థన చేయబడినది.

"సహ" అను పదమునకు మరియొక అర్థమును చెప్పుకొనవచ్చును. 'సహ' అనునపుడు సహకారమును ధ్వనింప జేయును. ఈ 'సహకారము మమ్ము రక్షించుగాక అను అర్థము వచ్చును. సహకార పదమేట్లేర్పడినది? 'స' – ఉచ్ఛ్వాసమునకు, 'హ' – నిశ్వాసమునకు సంబంధించిన అక్షరములుగా ఇంతకు పూర్వము చెప్పబడినవి. పొరపాటుపడక నిరంతరము జరుగు ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసముల మధ్యనుండు సమన్వయ సంబంధమును 'సహకార' మందురు. ఈ సహకారమువలననే గదా జీవి బ్రతికి బట్టకట్ట గలుగునది. కావున, మన బ్రతకునకు, రక్షణకు మొదటి సహకారము – ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసముల మధ్య ఉన్నది. అందుచే 'ఉచ్ఛ్వాస, నిశ్వాసల మధ్యనుండు సహకారమెట్లుండునో – అట్టి సహకారము మామధ్య (గురుశిష్యుల మధ్య)

వర్తించి, మమ్ము రక్షించుగాక!' అని అర్థము. అనగా 'మేము ఎన్నడును విడిపోకుండ ఉందుముగాక' (విడిపోకుండుట మానసికముగా అని గురుశిష్యుల పట్ల అర్థము చేసికొనవలెను) అని ప్రథమముగా విద్యారంభమున శిష్యునిచే ప్రార్థన చేయబడినది.

ముందుగా "అవతు" అనుటలో రక్షణ విషయము చెప్పబడినది. బ్రతికి బట్టకట్టినపుడే గదా ఏదైన చేయుట. అందుచే, ముందుగా మేము రక్షింపబడుదుము గాక' అని చెప్పబడినది. లేదా, ఇరువురిలో నున్నవాడు మా ఇద్దఱిని రక్షించుగాక' అను అర్థమును కూడా చెప్పుకొనవచ్చును.

తరువాత "భునక్తు" అనుటలో అనుభవవిషయము చెప్పబడినది. అనుభవించుటను 'సాకుట లేదా పోషించుట' అను అర్థములో – 'పోషింప బడుటలోను, జీవితములోపొందు అనుభూతి విషయములోను మా ఇద్దఱిలో నున్నవాడు ఒకే విధముగా ఇద్దఱిని పోషించి, అనుభవించి, జీవించును గాక, ' అని చెప్పుకొనవలెను. ఇద్దఱి మనస్సులు విడివిడిగాకాక ఇరువురిమధ్యన, ఇరువురిలోను ఉన్న వాని మనస్సు వర్తించి, వర్ధిల్లు(దుము) గాక' అని గూఢార్థము.

"సహవీర్యం కరవావహై" అనుటలో 'మా ఇద్దఱిలోని పరమాత్మ వీర్యము చేతనే మా కర్మలు నిర్వహింపబడుగాక' అని చెప్పుకొనవలెను. ఇక్కడ వీర్యము అనగా ఏ పని చేయుటకైనను కావలసిన చురుకుదనము, ప్రయత్నము, దక్షత, సామర్థ్యము అను అర్థములుగా గ్రహించవలెను.

"తేజస్వి నౌ అధీతం అస్తు" అనుటలో 'ఇద్దఱినీ వ్యక్తపరచు ఆ ఒకే తేజస్సు మా ఇద్దఱి చేత అధ్యయనమును చేయించుగాక', లేదా మాచే 'ఆ తేజస్సు అధ్యయనము చేయబడుగాక" అని గూడ అర్థము చేసుకొనవలెను.

"మా విద్విషావహై" అనుటలో మా ఇద్దఱిమధ్య ద్వేషభావము లేక ఒకే అభిప్రాయము వర్తించి ఏకమతము అనగా – ఐకమత్యము (మతము అనగా అభిప్రాయము. ఏకమతమునకు తద్ధిత రూపము ఐకమత్యము) వర్ధిల్లుగాక అని అర్థము చెప్పుకొనవలెను.

ఈ విధముగా ఇద్దఱి మధ్య కలుగవలసినవి కలిగి, తొలగివలసిన ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవిక తాపత్రయము తొలగి, శాంతి వర్ధిల్లుగాక' అనుటతో ఈ సంప్రార్థనము ముగియును.

❄❄❄